సాక్షి తిరుపతి

బుధవారం। 1 । ఫిబ్రవరి। 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.58,800
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,252
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,900
రిటైల్ వెండి గ్రాము	రూ.71.90

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	32	21
చిత్తూరు	31	21
తిరుమల	27	17
గూడూరు	32	23
నగరి	32	22



బాలికల గృహం పరిశీలన

తిరుపతి లీగల్ : తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తిరుపతిలోని ప్రభుత్వ బాలికల గృహాన్ని పరిశీలించారు.

న్యూస్‌రీల్

సురక్షిత ప్రయాణం.. ఆర్టీసీ సొంతం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్: సురక్షిత ప్రయాణం...ఆర్టీసీ సొంతమని జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. తిరుపతి డీపీటీఓ కార్యాలయంలో మంగళవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ మేరకు ప్రమాదాల నివారణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం డీపీటీఓ మాట్లాడుతూ జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏటా దేశంలో 1.5 లక్షల మంది రోడ్డు ప్రమాదాల రూపంలో మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లు అప్రమత్తంగా మెలగాలని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ సీటీఎం భాస్కర్, డిప్యూటీ సీఈఎం నరసింహులు పాల్గొన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్



పోలీసు అధికారులతో చర్చిస్తున్న జడ్జి వై.వీర్రాజు

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో ఫిబ్రవరి 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేందుకు పోలీసులు సహకరించాలని తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ వై.వీర్రాజు పోలీసు అధికారులను కోరారు. మంగళవారం తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి వై.వీర్రాజు తన చాంబర్‌లో న్యాయమూర్తులు, పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకాదగిన క్రిమినల్ కేసులను ముందుగా గుర్తించి అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేటట్టు ప్రయత్నించాలని సూచించారు. రాజీకాదగిన కేసులను ముందుగా గుర్తించేటట్టు ఆయా స్టేషన్ల పోలీసులకు సూచనలు ఇవ్వాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జడ్జి నాగరాజు, సీనియర్ సివిల్ జడ్జిలు శ్రీనివాసరావు, శిరీష్, జూనియర్ సివిల్ జడ్జిలు పవన్‌కుమార్, సరిత, కోటేశ్వరరావు, తిరుపతి అర్బన్ స్టేషన్ల పరిధిలోని వివిధ స్టేషన్ల డీఎస్పీలు మురళీకృష్ణ, నరసప్ప, కాటరామరాజు, రామచంద్ర, సురేష్ కుమార్‌తో పాటు ఇతర స్టేషన్ల డీఎస్పీలు, కోర్టు మానిటరింగ్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.

తిరుచ్చిపై చిద్విలాసం



తిరుచ్చిపై ఊరేగుతున్న రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణ స్వామివారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. మంగళవారం స్వామివారి జన్మనక్షత్రమైన రోహిణి నక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఊంజల్‌సేవను కనుల పండువగా చేపట్టారు. అనంతరం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిలకిల హరివిల్లు!

• కామన్ కూట్



ఇది శేషాచలంలోని సిద్ధలగండి ప్రాజెక్టులో కనిపిస్తుంది. పాచి, పురుగులు, పక్షుల గుడ్లను ఆహారంగా తీసుకుంటుంది. చేపలంటే ఇష్టం. చూడ్డానికి అందంగా ఉంటుంది.

• కామన్ మూర్ హెన్



ఈ పక్షినే వాటర్ హెన్ అని కూడా పిలుస్తుంటారు. పూర్తి స్థాయిలో ఎదిగిన పక్షి బరువు 500 గ్రాములు ఉంటుంది. చేపలు, పురుగులు తింటుంది. సాలిపురుగులంటే భలే ఇష్టం.

• గ్రేట్ కార్మొరెంట్



ఇది కల్యాణిడ్యాం, సిద్ధలగండి, మల్లెమడుగు, వెంకటాపురం చెరువు ప్రాంతంలో కనిపిస్తుంది. మూడు నుంచి 5గుడ్లు పెడుతుంది. చేపలను వేటాడి తినడం దీని స్వభావం.

• లిటిల్ గ్రెబ్




ఇండియా అంతటా కనిపించే నీటి పక్షి అని చెబుతారు. ఇది దాదాపు 150–170 గ్రాముల బరువు ఉంటుంది. 22నుంచి 30సెం.మీ ఎత్తు వరకు పెరుగుతుంది.

• క్రెస్టెడ్ సెర్పెంట్ ఈగల్



ఇది కళ్యాణిడ్యాం, మామండూరులో కనిపిస్తుంది. ఎత్తయిన చెట్లపై వాలుతుంది. ఇది 41 నుంచి 70 సెం.మీ. ఎత్తు పెరుగుతుంది. పాములు, బల్లులు, కీటకాలు తింటుంది.

పురివిప్పిన మయూరాలు ... కోయిల గానాలు.. గుంపులు గుంపులుగా ఎగిరే రంగురంగుల పక్షులు, సంధ్యాసమయాన వినిపించే కిలకిలారావాలు ప్రకృతి ప్రేమికులను మైమరపిస్తాయి. చెట్ల కొమ్మలపై, తొర్రల్లోనూ నివసించే పక్షులు కొన్ని అయితే, పొదల మాటున, ఇసుక నేలపైన, రాతి గుహల్లో కనిపించే విహంగాలు మరికొన్ని శేషాచల కొండల్లో కనిపిస్తాయి. ఇక్కడికి విదేశాల నుంచి సీజన్ల వారీగా వచ్చే అతిథి పక్షులు, దట్టమైన అడవుల్లో జీవించే అరుదైన జాతి పక్షుల కోసం పరిశోధనలు సాగుతున్నాయి. పక్షిజాలానికి అవసరమైన భద్రత, సరైన ఆహారం ఈ దట్టమైన అడవుల్లో పుష్కలంగా ఉంది. ఈ అడవిలో విహరించే పక్షుల జీవనంపై సాగించిన అన్వేషణే ఈ విహంగ విహారం.





బర్డ్‌మెన్ కార్తీక్



• జంగిల్ బుష్ క్వెయిల్

సాధారణంగా కనిపించే కంజుపిట్ట జాతులలో ఇదొకటి. వేటగాళ్ల దాడులకు ఇవి ఎక్కువగా బలవుతుంటాయి. 15నుంచి 18సెం.మీ ఎత్తు వరకు పెరుగుతుంది. ఎక్కువ శాతం పాములు కూడా దీనిపై దాడి చేస్తాయి. గడ్డలకు ఇవంటే మహా ఇష్టం. ఒకదాని ఆహారం మరొకటి పంచుకొని తింటాయి. వర్షాకాలం పూర్తయినప్పటి నుంచి చలికాలం లోపు 6నుంచి 8గుడ్లు పెడతాయి.

• ఫ్లయింగ్ ఫాక్స్ (ఫ్రూట్ బ్యాట్)



ఎత్తయిన చెట్లలో పగలంతా ఉండి రాత్రి సమయంలో సుమారు 20 కిలోమీటర్ల దూరం వెళ్లి ఆహారాన్ని తీసుకుంటాయి. కానీ ఈ రకమైన గబ్బిలం దట్టమైన అడవుల్లో ఉంటూ పండ్లను ఆహారంగా తీసుకుంటుంది. ప్రపంచంలోని అతిపెద్ద గబ్బిలాల జాతిలో ఇదొకటిగా పేర్కొంటారు. దీని బరువు కిలో నుంచి రెండు కిలోల వరకు ఉంటుంది.

• గ్రే హెడెడ్ క్యానరీ ఫ్లైక్యాచర్

చెదలు, కీటకాలు దీని ఆహారం. ఈ పక్షులు సాధారణంగా కొండ సరిహద్దులోని చెట్లలో ఆవాసం ఏర్పరుచుకుంటాయి. మరో విశేషమేంటంటే, అంత సులభంగా కెమెరాకు చిక్కదు. పక్షి మొత్తం కూడా ఇంచుమించు 12–13సెం.మీ మాత్రమే ఉంటుంది. అసలు ఇది దగ్గరకు వెళ్లితే కానీ కనిపించదు. కూత విని పక్షిని గుర్తించాల్సి ఉంటుంది.

- శేషాచలంలో 215 జాతుల పక్షులు
- అతిథి పక్షులకు నిలయం
- సిద్ధవటం అడవుల్లో కలివికోడి ప్రత్యేకత

తిరుపతి అలిపిరి: శేషాచల కొండలు కొత్త తరహా పక్షుల ఆవాసాలకు నెలవైనవి అనడంలో సందేహమే అక్కర్లేదు. ఎత్తయిన పర్వతాలు, లోయలు, దట్టమైన అటవీప్రాంతం, కరువులోనూ ప్రవహించే సెలయేళ్లు, మడుగులు ఇక్కడి ప్రత్యేకత. అరుదైన క్రిమికీటకాలు, పసందైన పండ్లు దొరికే విశేష ప్రాంతం. అంతటి ఈ కొండల్లో పక్షుల సందడి అధికంగా ఉంటుంది. సాధారణంగా పక్షులు ఆహారం, ఆహ్లాదం ఉన్న ప్రాంతాల్లోనే నివాసాలు ఏర్పరచుకుంటాయి. పక్షుల జీవనానికి అనుకూల వాతావరణం శేషాచలం అడవులేనని పక్షిశాస్త్రవేత్తలు చెబుతున్న మాట. శేషాచల కొండల్లో శ్రీ వేంకటేశ్వర నేషనల్ పార్కు–353 చదరపు కిలోమీటర్లు టీటీడీ పర్యవేక్షణలో ఉంటుంది. వన్యప్రాణి అభయారణ్యం – 526 చదరపు కిలోమీటర్లు అటవీశాఖ పర్యవేక్షణలో ఉన్నాయి. ఈశాన్య పర్వత శ్రేణుల్లో భాగమైన శేషాచలం కొండలు ఎన్నో జంతువులు, పక్షి, కీటక, సర్ప జాతులకు ఆలవాలం. ప్రపంచంలో ఇప్పటి వరకు 9,026 పక్షి జాతులు గుర్తించగా, అందులో 1232 (13.66శాతం) మన భారతదేశంలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో ఇప్పటి వరకు కేవలం శేషాచల అటవీ ప్రాంతంలో 215 రకాల పక్షులను అధికారులు గుర్తించారు. వాటిలో 100 రకాల విహంగాలు శ్రీ వేంకటేశ్వర నేషనల్ పార్కులో ఉన్నట్లు గుర్తించారు. ఇవే కాకుండా అప్పుడప్పుడు వలస పక్షులు సైతం ఇక్కడికి వచ్చి సందడి చేస్తుండడం విశేషం.

కలివికోడి కోసం సాగుతున్న అన్వేషణ

శేషాచలం అటవీ ప్రాంతంలో మాత్రమే కనిపించే కలివికోడికి ప్రత్యేక చరిత్ర ఉంది. ఈ కోడిని జార్డన్స్ కూసర్ అని పిలుస్తారు. 1848లో కడప జిల్లా లంకమల్లేశ్వర్ ప్రాంతంలో బ్రిటీష్ పరిపాలకుడు తార్డన్ సి.థామస్ గుర్తించారు. ఆ తరువాత 1986లో భరత్ భూషణ్ మళ్లీ పరిశోధన చేశారు. లంకమల్లేశ్వర్ అటవీ ప్రాంతంలోని సిద్ధవటం వద్ద గుర్తించారు. ఈ ప్రాంతంలో గుర్తించిన ఓ కలివికోడి కళేబరం బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ వద్ద భద్రపరచినట్లు సమాచారం. తాజాగా 2016–17లో సిద్ధవటం అటవీ ప్రాంతంలో పక్షిపరిశోధకుడు కార్తీక్ మళ్లీ కలివికోడి కూత వినిపించినట్లు చెబుతున్నారు. ఈ కోడి మళ్లీ కనిపిస్తే మన అటవీ ప్రాంతం దేశానికే ఆదర్శం అని చెబుతున్నారు.

• గ్రీన్ బీ ఈటర్



ఈ పక్షి ఎక్కువగా గాల్లో ఎగురుతున్న తూనీగ, సీతాకోక చిలుక, పురుగులను వేటాడి తింటుంది. కొన్ని సమయాలలో చీమలను సైతం తింటుంది. మార్చి నుంచి జూన్ వరకు మట్టిగడ్డలు ఉన్న చోట రంధ్రం ఏర్పరుచుకొని మూడు నుంచి ఐదు గుడ్లు పెట్టి పిల్లలను ఇడుగుతుంది.

• ఇండియన్ నైట్ జార్



రాత్రిపూట చురుగ్గా కనిపిస్తుంది. పొదల్లో ఇసుకనేలపైనే గుడ్లుపెడుతుంది. అస్సలు ఆ గుడ్లను కనుగొనాలంటే పరిశోధించాల్సిందే. దీనిని గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తపడాయ్(ఆల్టపడాయ్) అని వాడుక భాషలో పిలుస్తుంటారు. మనిషి దగ్గరకు వెళ్లే వరకు అక్కడే ఉండి పుర్రుమని ఎగిరి భయపెడుతుంది. దీనికి కళ్లు రాత్రి సమయాల్లో అతిపెద్దగా కాంతివంతంగా కనిపిస్తాయి. రోడ్లపై ఉండడానికి ఈ పక్షి ఆసక్తి చూపుతుంది. దీంతో రహదారుల్లో మృతి చెంది, వీటి సంఖ్య గణనీయంగా తగ్గినట్లు పరిశోధకులు చెబుతున్నారు.

• మలబార్ గ్రే హాంబిల్



తూర్పు కనుమల్లోని దట్టమైన అడవిలో మాత్రమే ఈ పక్షి జీవిస్తుంది. మనిషిని చూస్తే ఆగ్రహం వ్యక్తం చేయడం దీని స్వభావం. పండ్ల చెట్లపై అధికంగా కనిపిస్తుంది. తన పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటుంది. ఏడాదికి మూడు నుంచి నాలుగు పిల్లలను వృద్ధి చేస్తుంది. తన పిల్లలను కాపాడేందుకు ఎత్తయిన చెట్లను ఎంచుకొని తొర్రలు ఏర్పాటు చేస్తుంది.

• స్కేలీ బ్రెస్టెడ్ మునియా



అతిచిన్న పక్షిజాతులలో ఇదొకటి. చిన్న చిన్న కీటకాలను, గడ్డిపై నివసించే పురుగులు, చిన్నపాటి విత్తనాలను ఆహారంగా తీసుకుంటుంది. రైతుల పంటపొలాల్లో చీడపురుగులను తిని పంటను రక్షించడానికి ఉపయోగపడుతుంది. జూన్–అక్టోబర్ మాసాల్లో 3, 4 పిల్లలను వృద్ధి చేసుకుంటుంది.

• ఇండియన్ పీ ఫౌల్



తలకోన, మామండూరు, పాపవినాశనం, బాలపల్లి, కడప, కోడూరు సరిహద్దు లో ఇవి అధికంగా కనిస్తాయి. ఈ రకం నెమలి మనుషులతో స్నేహం చేయడానికి ఆసక్తి చూపుతుంది.

• జార్డాన్స్ బుష్ లార్క్



ఎక్కువ శాతం మట్టిలో ఉండే పురుగులు, చీమలు, మిడతలు, వానపాములు వంటివి ఆహారంగా తీసుకుంటుంది. ఎక్కువ శాతం వేడి, ఎండ, రాళ్లు, గుహలు వంటి ప్రాంతాల్లో నివసిస్తుంది. వీటిని గద్దలు వంటివి వేటాడి తింటాయి.

• టానీ బెల్లీడ్ బ్యాబ్లర్



ఈ పక్షికి సిగ్గు ఎక్కువ. సాధారణంగా మనుషులకు కనిపించదు. అడవిలోని జంతువులకు సైతం దూరంగా ఉంటుంది. చిన్న చిన్న పొదలను ఆవాసం చేసుకొని జీవిస్తుంది. దీనినే రూఫస్ బెల్లీడ్ బ్యాబ్లర్ (కాషాయ వర్ణ పిట్ట) అని కూడా అంటారు. మే నుంచి సెప్టెంబరు మాసాల్లో పిల్లలను వృద్ధి చేసుకుంటుంది. అడివి విడిచి పెట్టి రావడానికి అస్సలు ఇష్టపడదు.

• వైట్ రంప్‌డ్ షామా



ఆరు నుంచి ఏడు కూతలతో అరవడం దీని ప్రత్యేకత. దీనిని గుర్తించాలని ప్రయత్నించిన వారిని వేర్వేరు కూతలతో తికమక పెట్టడం దీని నైజం. ఇవి 20 నుంచి 25సెం.మీ వరకు పొడవు ఉంటాయి. పుంజులైతే అందంగా ఆకర్షవంతంగా గాఢమైన రంగులో ఉంటాయి. పెట్టలైతే సాధారణ రంగులో ఉన్నప్పటికీ కూతలు మాత్రమే క్షణక్షణానికి మారుస్తాయి.

• వైట్ స్పాటెడ్ ఫ్యాంటైల్



ఈ పక్షికి ఛాతిపై తెల్లటి చుక్కలు ఉంటాయి. దాని రెక్క పురివిప్పినప్పుడు కనిపించే ఈక ఫ్యాను రెక్కను పోలి ఉంటుంది. ఐస్ క్రీమ్ కప్ తరహాలో గూడు నిర్మించుకోవడం దీని ప్రత్యేకత. చిన్నపాటి కొమ్మలపైన గడ్డిపోచలతోనే గూడు కట్టుకుని అందులో నివసిస్తుంది. చూడ్డానికి చాలా వింతగా.. అందంగా కనిపిస్తుంది.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి



కల్లూరులో జెడ్పీ అతిథిగృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో కలెక్టర్

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలో నిర్వహించిన పల్లెబాట ఆయన మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా.. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. దేశంలోనే తొలిసారిగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలను అందించడమే కాకుండా, ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని వెల్లడించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామీణ మహిళలు సైతం ఆర్థికంగా బలోపేతమయ్యారని తెలిపారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ క్రమంలోనే పుంగనూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డిని కేంద్రబృందం సభ్యుల కలిశారు. జిల్లా అభివృద్ధిలో మంత్రి పాత్రపై ప్రశంసలు కురిపించారు. అనంతరం కల్లూరులో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన జెడ్పీ అతిథిగృహాన్ని మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం, పీఆర్ సీఈ చంద్రశేఖరరెడ్డి, నేతలు రెడ్డీశ్వరరెడ్డి, వల్లివేడు రాజారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై దృష్టి పెట్టండి

- నూళ్లూరుపేట నియోజకవర్గంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

ఓజిలి: ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా ఓజిలి సచివాలయాన్ని తనిఖీ చేశారు. తర్వాత ఆరోగ్యకేంద్రంలో రికార్డులను పరిశీలించి.. స్థానికంగా 27 మంది గర్భిణులు ఉంటే అందులో 23 మంది పేర్లు మాత్రమే ఆన్‌లైన్‌లో ఉన్నాయని, మిగిలిన వారి పేర్లు ఎందుకు నమోదు చేయలేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి.. పిల్లల ఎత్తు, బరువు తదితర అంశాలను నేరుగా పరిశీలించారు. సంక్షేమ పథకాల అమలులో అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం రాజుపాళెం గ్రామంలో ఈ–క్రాప్, ఈకేవైసీ, వ్యవసాయశాఖలో అమలవుతున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతిరైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. తర్వాత చిలమానుచేను గ్రామంలో సుదీప్తి అనే గర్భిణి వద్దకు వెళ్లి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న గుడ్లు, పాలు, భోజనం తదితర వాటిపై వివరాలు తెలుసుకున్నారు. ఆర్మేనిపాడు గ్రామంలో బరువు తక్కువ ఉన్న పిల్లలకు వైద్య సిబ్బంది ద్వారా రక్తపరీక్షలు చేయించారు. ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పథకంలో జరుగుతున్న పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పదవ తరగతి విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ చంద్రముణిరాణాల్, మెప్మా పీడీ రాధమ్మ, డీఎంహెచ్ఓ శ్రీహరి, డీఎల్‌డీఓలు సుశీలమ్మ, వాణి, జేడీ ప్రసాద్, తహసీల్దార్ లాజరస్, ఎంపీడీఓ రజనీకాంత్, సీడీపీఓ జ్యోతి, ఎస్ఐ దారం ఆదిలక్ష్మి తదితరులు ఉన్నారు.



ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు బరువు తూస్తున్న కలెక్టర్

ఆ వీఆర్వోను సస్పెండ్ చేయండి

ఓజిలి వీఆర్వో శ్రీనివాసులు నగదు తీసుకుని పనులు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఫోన్‌పే ద్వారా అతను తీసుకున్న మొత్తానికి సబంధించిన వివరాలను జిరాక్స్ కాపీలతో సహా కలెక్టర్‌కు అందించారు. దీనిపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. వెంటనే సంబంధిత వీఆర్వోను సస్పెండ్ చేయాలని తహసీల్దార్ లాజరస్‌ను ఆదేశించారు. అనంతరం పలు సమస్యలపై వినతులు స్వీకరించారు.

94శాతం ఈ–క్రాప్ పూర్తి

తిరుపతి అర్బన్: ఈ– క్రాప్ నమోదుపై జిల్లా అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. జేసీ డీకే బాలాజీ చిన్నగొట్టిగల్లు, భాకరాపేట ప్రాంతాల్లో ఈక్రాప్ నమోదును పరిశీలించారు. గత ఖరీఫ్ కంటే ఈ రబీలో పంట ఈ క్రాప్ చేయడంలో వ్యవసాయశాఖ అధికారులు సక్సెస్ అయ్యారని కొనియాడారు. తక్కువ రోజుల్లోనే 94శాతం పూర్తి చేశారని అభినందించారు. జిల్లా వ్యాప్తంగా 2,01,612 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేయగా 1,88,860 ఎకరాల్లో ఈ క్రాప్ పూర్తయిందని, మిగిలిన ఆరు శాతాన్ని ఈ నెల 5వ తేదీనాటికి పూర్తి చేయాలని చెప్పారు. ఈ క్రాప్ చేసుకున్న రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

వైభవంగా శ్రీవారి మెట్లోత్సవం



అలిపిరి పాదాల మండపం వద్ద మెట్ల పూజ నిర్వహిస్తున్న సుగుణేంద్రతీర్థస్వామి, ఆనందతీర్థ చార్యులు

తిరుపతి కల్చరల్: భజన మండళ్ల సభ్యులు మహర్షలు సూచించిన మార్గంలో నడిచి శ్రీవారి వైభవాన్ని, ధర్మప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలని ఉడిపికి చెందిన పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్ర తీర్థస్వామిజీ ఉద్బోధించారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం మంగళవారం తెల్లవారుజామున అలిపిరి పాదాల మండపం వద్ద వైభవంగా నిర్వహించారు. ముందుగా సుగుణేంద్రతీర్థ స్వామి, దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పీఆర్.ఆనందతీర్థాచార్యులు మెట్ల పూజ నిర్వహించారు. స్వామిజీ మాట్లాడుతూ బ్రహ్మముహూర్తంలో కాలినడకన మెట్లను అధిరోహించి తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమన్నారు. దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థచార్య మాట్లాడుతూ భజన మండళ్ల సభ్యులకు టీటీడీ మూడో సత్రం ప్రాంగణంలో ధార్మిక శిక్షణ, హరిదాస కీర్తనల్లో అంత్యాక్షరి, దాస సాహిత్యంలో రసప్రశ్నల స్పర్థ, సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన సభ్యులు తమతమ ప్రాంతాలకు వెళ్లి భక్తజనావళికి సనాతన ధార్మిక అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. దీనికిముందు భజన మండళ్ల సభ్యులు టీటీడీ మూడో సత్రం ప్రాంగణం నుంచి అలిపిరి శ్రీవారి పాదాల మండపం వద్దకు చేరుకున్నారు. అనంతరం మెట్ల పూజ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహా రాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన 3,500 మంది భక్తు లు భజనలు చేసుకుంటూ తిరుమల గిరులను అధిరోహించారు.



మెట్ల పూజకు హాజరైన భజన మండళ్ల సభ్యులు

అట్టహాసంగా సాక్షి ప్రీమియర్ లీగ్ ప్రారంభం

- తుమ్మలగుంట గ్రౌండ్‌లో జిల్లా స్థాయి ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలు
- తొలిరోజు ఆరు మ్యాచ్‌లు

రుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి మీడియా గ్రూప్ నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీల్లో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఐసీసీ నిబంధనల మేరకు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో నిర్వహిస్తున్న ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలకు తిరుపతి సమీపంలోని తుమ్మలగుంట క్రీడా మైదానం వేదికయ్యింది. ఈ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వివిధ విద్యాసంస్థల నుంచి సీనియర్స్ విభాగంలో 31, జూనియర్స్ విభాగంలో 7, మొత్తం 38 జట్లు పాల్గొంటున్నాయి.

ప్రతిభను వెలికితీయడానికే

తొలిరోజు మంగళవారం ఎస్‌పీఎల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, లా అండ్ ఆర్డర్, అడ్మిన్ అదనపు ఎస్పీలు కులశేఖర్, వెంకట్రావ్ పాల్గొన్నారు. క్రికెటర్లను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు బ్యాటింగ్, బౌలింగ్ చేసి ఎస్‌పీఎల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహిస్తూ క్రీడాకారుల్లో దాగున్న ప్రతిభను వెలికితీసేందుకు ఎస్‌పీఎల్ పోటీలను నిర్వహిస్తున్న సాక్షి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. అదనపు ఎస్పీలు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. గెలుపోటములకు అతీతంగా క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలని కోరారు. సాక్షి బ్రాంచ్ మేనేజర్ సత్యేంద్రబాబు మాట్లాడుతూ ఎస్‌పీఎల్ పోటీలను జిల్లా, రీజనల్, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాక్షి ఈవెంట్స్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల - ఎమరాల్డ్స్ జట్ల మధ్య క్రికెట్ పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ ఎస్పీలు వెంకట్రావ్, కులశేఖర్ తదితరులు

తొలి రోజు మ్యాచ్‌లు ఇలా..

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తుమ్మలగుంట క్రీడా మైదానంలో తొలిరోజు సీనియర్స్ విభాగంలో క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. రెండు మైదానాల్లో కలిపి మొత్తం 6మ్యాచ్‌లు నిర్వహించారు. బ్యాట్స్‌మెన్లు ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు. బౌలర్లు పదునైన బంతులతో వికెట్లను పడగొట్టి ప్రత్యర్థి జట్టుకు చుక్కలు చూపించారు.


55 పరుగులు చేసిన శేఖర్‌నాయక్

గ్రౌండ్ 1లో...

- ఎస్‌జీఎస్ జట్టుపై ఎస్వీయూ జట్టు 10 వికెట్ల తేడాతో సునాయస విజయాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌జీఎస్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన ఎస్వీయూ జట్టు కేవలం 3.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 52 పరుగులు చేసింది. ఎస్వీయూ జట్టు బ్యాట్స్‌మెన్ వినయ్ 20 బంతుల్లో 6ఫోర్లు, 1 సిక్స్‌తో 39 పరుగులు చేశాడు.
- సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల జట్టుపై రామాపురం ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల జట్టు 28 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎమరాల్డ్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన సెవెన్‌హిల్స్ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 82 పరుగులు మాత్రమే చేసింది. ఎమరాల్డ్స్ బ్యాట్స్‌మెన్ భరత్ 25 బంతుల్లో 4 ఫోర్లు 2 సిక్సర్లతో 40 పరుగులు చేశాడు.
- పుత్తూరు శ్రీరమణ డిగ్రీ కళాశాల జట్టుపై శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీరమణ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 54 పరుగులు చేయగా, శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ జట్టు 4.2 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసి విజయం సాధించింది.

గ్రౌండ్ 2లో..

- ఎస్వీఈసీ జట్టుపై 41 పరుగుల తేడాతో తిరుపతి ఎమరాల్డ్స్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఎమరాల్డ్స్ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 94 పరుగులు చేయగా, ఎస్వీఈసీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 53 పరుగులు మాత్రమే చేసింది. ఎమరాల్డ్స్ జట్టు బ్యాట్స్‌మెన్ మదన్ 16 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 30 పరుగులు చేశాడు.
- ఎస్వీసీఈ జట్టుపై 35 పరుగుల తేడా ఎస్‌డీహెచ్‌ఆర్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీసీఈ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 88 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన ఎస్వీసీఈ జట్టు 53 పరుగులకు ఆలవుట్ అయ్యింది. ఈ మ్యాచ్‌లో ఎస్‌డీహెచ్‌ఆర్ బౌలర్ లోకేష్ 2 ఓవర్లలో 5 వికెట్లు పడగొట్టి ఆకట్టుకున్నాడు.
- గొల్లపల్లి సిద్ధార్థ జట్టుపై ఎస్‌జీఎస్ జట్టు 34 పరుగుల తేడాతో గెలుపొంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్‌జీఎస్ జట్టు 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేయగా.. తరువాత బ్యాటింగ్‌కు దిగిన గొల్లపల్లి సిద్ధార్థ జట్టు 10 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. ఎస్‌జీఎస్ జట్టు బ్యాట్స్‌మెన్ శేఖర్ 26 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 50 పరుగులు చేశాడు.


బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


గెలుపొందిన ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు


గెలుపొందిన పద్మావతి స్కూల్‌ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు క్రికెట్‌జట్టు సభ్యులు


విజయకేతనం ఎగురవేసిన ఎస్‌జీఎస్ కళాశాల జట్టు

శ్రీవారి సేవలో మంత్రి రోజా



తిరుమల: రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో 19వ బ్యాచ్‌కి దరఖాస్తుల స్వీకరణ

తిరుపతి అర్బన్: తిరుపతి అలిపిరి డిపో పరిధిలోని ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణ కోసం 19వ బ్యాచ్‌కి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఇన్‌చార్జి డీఎం ప్రభాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18వ బ్యాచ్‌కు శిక్షణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 17 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వడంతో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందారని వెల్లడించారు. డ్రైవర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

51 మంది ఉద్యోగాలకు ఎంపిక

చిట్టమూరు: నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లో ఉన్న గ్రీన్‌టెక్ కంపెనీలో ఉద్యోగాల కోసం 51 మంది ఎంపికై నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మల్లాం సచివాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్తంగా ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 69 మంది అభ్యర్థులు హాజరు కాగా 51 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఎంపికయ్యారని అధికారులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఫిబ్రవరి 6వ తేదీ నుంచి విధుల్లో హాజరకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకాడు ఎంపీడీఓ గోపీనాథ్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు

రెండు కార్లు ఢీ

చంద్రగిరి: భాకరాపేట కనుమలో మంగళవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి నుంచి రాయచోటికి కొందరు కియా కారులో ప్రయాణిస్తున్నారు. ఇదే క్రమంలో రాయచోటి నుంచి తిరుపతికి హోండా కారులో మరో ఇద్దరు వస్తున్నారు. భాకరాపేట కనుమ దారిలో ఎదురెదురుగా వస్తున్న కార్లు ఒక్కసారిగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు కార్లలోని బెలూన్‌లో తెరుచుకోవడంతో నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు ప్రైవేటు వాహనాల్లో తిరిగి వెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా వాహనాలను పక్కకు తొలగించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.


కనుమదారిలో ఢీకొన్న కార్లు

ట్రాక్టర్‌ను ఢీకొన్న చేపల లారీ : క్లీనర్ మృతి

దొరవారిసత్రం: అతివేగానికి తోడు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా చేపల మినీ లారీ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో లారీ క్లీనర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి కుప్పారెడ్డిపాళెం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం.. నెల్లూరు నుంచి చేపల లోడ్డుతో చెన్నై మార్కెట్‌కు మినీ లారీ బయలుదేరింది. మార్గమధ్యంలోని కుప్పారెడ్డిపాళెం గ్రామ సమీంలో డ్రైవర్ భాస్కర్ నిద్రలోకి జారుకోవడంతో ముందు కట్టెల లోడ్డుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ ఒక్కసారిగా నడిరోడ్డుపై బోల్తాకొట్టింది. మధురైకి చెందిన లారీ క్లీనర్ చిన్న పాండ్యన్(30) అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన డ్రైవర్‌ను స్వర్ణాటోల్‌వే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుమారు మూడు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు క్రేన్ సాయంతో లారీని తొలగించి.. క్లీనర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ తిరుములరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడిన చేపలు

చెట్టుపై నుంచి పడి ఉద్యోగి మృతి

తిరుమల : మామిడి ఆకులు కోసేందుకు చెట్టుపైకి ఎక్కిన టీటీడీ గార్డెనింగ్ ఉద్యోగి పట్టుతప్పి కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. తిరుపతి గ్రామీణ మండలం అవిలాలలో నివాసముంటున్న కె.వెంకటేశులు (59) టీటీడీ గార్డెనింగ్ విభాగంలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. రోజూ వైభవోత్సవ మండపం, శ్రీవారి ఆలయం ముందు మామిడాకులతో తోరణం కట్టే పనులను ఇతను నిర్వహించేవాడు. అందులో భాగంగా జీఎన్‌సీ సమీపంలోని ఓ ఉద్యానవనంలో మామిడి చెట్టుపైకి ఎక్కి మామిడాకులు కోస్తుండగా అకస్మాత్తుగా చెట్టుకొమ్మ విరగడంతో చెట్టుపై నుంచి పడిపోయాడు. వెంటనే సమీపంలోని గార్డెనింగ్ ఉద్యోగులు టీటీడీ అశ్విని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.


మృతుడు వెంకటేశులు

శరవేగంగ నిర్మాణ పనులు


ఆలయ గర్భగుడి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ఆలయ అధికారులు, పార్టీ నేతలు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.12 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఆలయ నిర్మాణ పనులు వచ్చే గంగజాతర నాటికి పూర్తిచేసే దిశగా స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చర్యలు ముమ్మరం చేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యేతో పాటు మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ మంగళవారం అమ్మవారి ఆలయానికి విచ్చేసి జరుగుతున్న పనులను పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని దేవదాయ, టీటీడీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మే 9న అమ్మవారి జాతర ప్రారంభం కానుందని, అంతలోపు అమ్మవారి గర్భాలయ పనులు పూర్తిచేయాలని సూచించారు.



వారి వెంట ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ మునిక్రిష్ణయ్య, పార్టీ సీనియర్ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, పెంచులయ్య, తులసీయాదవ్, మార్కెట్ గురవారెడ్డి, భరిణియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రాజధాని నిర్ణయాన్ని స్వాగతిస్తాం

తిరుపతి కల్చరల్: విశాఖ రాజధాని కాబోతోందంటూ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాజారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అధికార, పరిపాలనా వికేంద్రీకరణ ద్వారానే సాధ్యమవుతుందని భావించి మూడు ప్రాంతాల అభివృద్ధికి శాసన, న్యాయ, పరిపాలనా రాజధానులు ఏర్పాటు చేయాలని సంకల్పించడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో కేవలం హైదరాబాద్ ఒక్కటే అభివృద్ధి చేయడంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలు వెనుబడిపోయాయని గుర్తుచేశారు. రాష్ట్ర విభజన తర్వాత అలాంటి పొరబాటు జరగకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని కొనియాడారు.

85 మందికి కృత్రిమ అవయవాల పంపిణీ

తిరుపతి కల్చరల్: ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ ప్రతాప్‌స్వామి ఆధ్వర్యంలో రెండవ రోజు మంగళవారం దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. మహిళా మండలి మందిరంలో చేపడుతున్న ఈ కార్యక్రమంలో జైపూర్ నుంచి విచ్చేసిన ప్రత్యేక సిబ్బంది 85 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు వితరణ చేశారు. బుధవారం చివరి రోజు కూడా జరిగే ఈ పంపిణీ కార్యక్రమాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కోరారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, వాసు, ప్రవీణ్ పాల్గొన్నారు.


దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు అందజేస్తున్న నిర్వాహకులు

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

కోట: పుట్టింటి నుంచి భార్య కాపురానికి రాలేదని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. ఎస్‌ఐ పుల్లారావు కథనం.. మండలంలోని గూడలి గ్రామానికి చెందిన పురుషోత్తం(27) కుటుంబ కలహాల కారణంగా సోమవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో విషపు గుళికలుతిని తనువు చాలించాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

గాయపడిన మహిళ మృతి : మోటార్‌బైక్ ఢీకొని గాయపడి నెల్లూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మస్తానమ్మ(45) మంగళవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కోట బజారువీధిలో గాజుల దుకాణం నడుపుతున్న మస్తానమ్మను రెండు రోజుల క్రితం కోటలో మోటార్‌బైక్ ఢీకొంది. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఎస్‌ఐ పుల్లారావుకు ఫిర్యాదు చేశారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవితఖైదు

నెల్లూరు(లీగల్): భార్య హత్య కేసులో తడ మండలం తడకండ్రిక గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ అలియాస్ మహ్మద్ అహ్మద్‌కు శిక్ష ఖరారైంది. జీవితఖైదుతోపాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. తమిళనాడు వేలూరు ప్రాంతానికి చెందిన వినోద్‌కుమార్ కాంచీపురం రంగపురం గ్రామానికి చెందిన అన్సర్ అఫ్రూన్నీసాను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వినోద్‌కుమార్‌కు తడ మండలం శ్రీసిటీలో ఉద్యోగం రావడంతో తడకండ్రిగ గ్రామంలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. కట్నం తీసుకురాలేదని భర్త ఆమెను వేధింపులకు గురిచేసేవాడు. ఈ నేపథ్యంలో 2013 సంవత్సరం జూన్ 29న రాత్రి అతను భార్యతో గొడవ పెట్టుకుని కిరోసిన్‌ను ఆమె ఒంటిపై పోసి నిప్పంటించి వెళ్లిపోయాడు. బాధితురాలు చెన్నైలో చికిత్స పొందుతూ జూలై 4వ తేదీన మృతిచెందింది. ఆమె చికిత్స పొందుతున్న సమయంలో ఇచ్చిన మరణ వాంగ్మూలం మేరకు తడ పోలీసులు వినోద్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.ప్రసాద్ కేసు వాదించారు.